

కొనసాగిన టెట్ పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (ఎపి టెట్)-2024 మూడో రోజు శనివారం ప్రశాంతంగా సాగాయి. వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ సిబిఎస్ఇ పాఠశాలలో ఉదయం 9:30 గంటల నుంచి 12 గంటల వరకు జరిగిన పరీక్షకు మొత్తం 185 మందికి 159 మంది హాజరయ్యారు. 26 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం 2:30 నుంచి 5 గంటల వరకు జరిగిన పరీక్షకు మొత్తం 185 మందికి 166 మంది హాజరవ్వగా 19 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా సాగినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం తెలిపారు.

ఇసుకపై చేతులెత్తేశారు..!

ఆన్‌లైన్‌లో బుకింగ్‌కాని పరిస్థితి

ఏ స్టాక్ పాయింట్‌లో చూసినా 'నో శ్యాండ్' అంటూ దర్శనం

ఏలూరు జిల్లాలో ఏకైక స్టాక్ పాయింట్‌లోనూ అదే పరిస్థితి

ఇసుక కోసం నిర్మాణదారులు నానావస్థలు


పనుల్లేక భవన నిర్మాణ కార్మికుల పస్తులు

'నా పేరు వెంకటేశ్వరరావు. నిడమర్రు మండలం. ఇసుక కోసం నాలుగైదు రోజులుగా ప్రయత్నిస్తున్నాను. ఆన్‌లైన్‌లో బుకింగ్ కావడం లేదు. నోశ్యాండ్ అని చూపిస్తోంది. ఇంటి నిర్మాణ పనులు ఆగిపోయాయి. కొద్దిరోజుల క్రితం అధిక ధర చెల్లించి లోడు ఇసుక తెచ్చాను. ఇప్పుడు అసలు ఇసుకే దొరకని పరిస్థితి నెలకొంది'.

'నా పేరు కిషోర్, నిడమర్రు మండలం. ఇసుక కోసం ఆన్‌లైన్‌లో ప్రయత్నిస్తున్నా బుకింగ్ కావడం లేదు. ఇసుక కొరత సమస్య తీవ్రంగా మారింది. నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. వెంటనే ఇసుక సరఫరా సాఫీగా సాగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.'

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పైన పేర్కొన్న వెంకటేశ్వరరావు, కిషోర్‌లే కాదు.. రెండు జిల్లాలవ్యాప్తంగా ఇసుక కోసం నిర్మాణదారులంతా పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. ఇసుక అందించలేక ప్రభుత్వం చేతులెత్తేసిన పరిస్థితి నెలకొంది. ఆన్‌లైన్‌లో అట్టహాసంగా ఇసుక బుకింగ్ ప్రారంభించిన కొద్దిరోజులు గడవకముందే పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఉచిత ఇసుక అంటూ ప్రభుత్వం తమను నిలువెల్లా ముంచేసిందని నిర్మాణదారులు గగ్గోలు పెడుతుండగా, తమకు ఉపాధి లేకుండా పోయిందని భవన నిర్మాణ కార్మికులు లబోదిబోమంటున్నారు. అధికారం చేపట్టి దాదాపు నాలుగు నెలలు కావొస్తున్నా ఇప్పటికీ ఇసుక సరఫరాపై ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోలేకపోయింది. ఇసుక దొరకక రెండు జిల్లాల్లోని ప్రజలు పడుతున్న అవస్థలు అత్యంత దారుణంగా మారాయి. ఏలూరు జిల్లాలో ఉంగుటూరు మండలం చేబ్రోలు, కుక్కునూరు మండలంలో ఇబ్రహీంపేట, వింజరంలో మొత్తం మూడు స్టాక్ పాయింట్లు ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. తొలి నుంచి చేబ్రోలు, వింజరం స్టాక్ పాయింట్లు ఇసుక లేకుండాపోయింది. ఇబ్రహీంపేట స్టాక్ పాయింట్‌లో 72 వేల మెట్రిక్ టన్నుల ఇసుక ఉన్నట్లు అధికారులు చెప్పారు. ఇప్పుడు అక్కడ కూడా ఇసుక లేదని ఆన్‌లైన్‌లో చూపిస్తున్న పరిస్థితి ఉంది. సెప్టెంబర్ 19న ఇసుక ఆన్‌లైన్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. పట్టుమని 15 రోజులు గడవక ముందే ఆన్‌లైన్ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. పశ్చిమగోదావరి జిల్లాలో ఇసుక స్టాక్ పాయింట్లు లేకపోవడంతో తూర్పుగోదావరి జిల్లాలోని పందలపర్రు, పెండ్యాల, రాజమండ్రి వంటి ఇసుక స్టాక్ పాయింట్లలో ఇసుక తెచ్చుకోవచ్చునని అధికారులు తెలిపారు. ఆన్‌లైన్‌లో తెరిస్తే మాత్రం తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని స్టాక్ పాయింట్లలోనూ నో శ్యాండ్ అంటూ చూపిస్తున్న పరిస్థితి ఉంది.



నోశ్యాండ్ అంటూ ఆన్‌లైన్‌లో చూపుతున్న సందేశం

ఇసుక బుకింగ్ కోసం ప్రయత్నిస్తున్న వారికి ఆన్‌లైన్‌లో వస్తున్న సందేశం ఏమిటంటే 'ప్రభుత్వం ఎంపిక చేసిన స్టాక్‌యార్డ్‌లో ఇసుక స్టాక్ అందుబాటులో లేదు. దయచేసి మళ్లీ ఇసుక బుకింగ్ చేయడానికి ప్రయత్నించకండి' అని చూపిస్తోంది. దీంతో నిర్మాణదారులకు ఏం చేయాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వంలో 20 టన్నుల ఇసుక రూ.18 వేలకు లభించగా, ఈ ప్రభుత్వం ఉచిత ఇసుక అని చెబుతూ 20 టన్నులకు రూ.23 వేలు వసూలు చేస్తోంది. డబ్బులు ఎక్కువైనా ఇసుక దొరికితే చాలనుకుని నిర్మాణదారులు ముందుకొచ్చినా ఇసుక కూడా అందించలేని పరిస్థితికి ప్రభుత్వం చేరింది. దీంతో జనం నుంచి తీవ్ర ఆగ్రహ జ్వాలలు వెల్లువెత్తుతున్నాయి.

పనుల్లేక కార్మికుల పస్తులు

ఇసుక లేకపోవడంతో భవన నిర్మాణ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో భవన నిర్మాణ కార్మికులకు పనుల్లేకుండా పోయాయి. రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబాలకు ఇది పెనుశాపంగా మారింది. ప్రభుత్వాలు మారినా భవన నిర్మాణ కార్మికుల కష్టాలు మాత్రం తీరని పరిస్థితి ఉంది. రెండు జిల్లాల్లో దాదాపు రెండు లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది. ఇసుక సరఫరాలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు జనంలో చర్చనీయాంశమైంది. ఇంటి నిర్మాణం చేసుకుంటున్న సామాన్య ప్రజానీకం పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. అధిక ధరకు ఇసుక కొనుగోలు చేయలేక, మరోపక్క ఇసుక దొరకక ఇంటి నిర్మాణ పనులు నిలిపేయాల్సిన దుస్థితి దాపురించింది. జిల్లాలోని మైనింగ్ అధికారులు సైతం సరిగా స్పందించని పరిస్థితి నెలకొనడంతో అంతటా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న విఒఎలు, సిఐటియు నాయకులు

విఒఎల తొలగింపు తగదు

తక్షణం విధుల్లోకి తీసుకోవాలని కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో అక్రమంగా తొలగించిన విఒఎలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఎపి వెలుగు విఒఎ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అన్యాయంగా తొలగించిన విఒఎలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఐదు నెలల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని, విఒఎలకు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని నినదించారు. యూనియన్ జిల్లా కోశాధికారి పి.ఆమని అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎప్పటి నుంచో విధులు నిర్వర్తిస్తున్న విఒఎలను రాజకీయ వేధింపులకు గురి చేస్తూ, అక్రమంగా తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మా ప్రభుత్వంలో మా ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తామంటూ స్వయంగా అధికార పార్టీ నాయకులే అక్రమంగా విఒఎలను తొలగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నాయకులే నేరుగా వెళ్లి తెల్ల కాగితాలపై సంతకాలు చేయించి, గ్రూపుల ఆమోదం తీసుకోకుండా, గ్రామ సంఘం సమావేశాలు ఏర్పాటు చేయకుండా విఒఎలను తొలగించడం దుర్మార్గమన్నారు. యూనియన్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాషిని మాట్లాడుతూ విఒఎలు డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేసి గ్రామాల్లో అనేక సేవలు అందిస్తున్నారని, అయినా వారిపై కక్ష కట్టి అన్యాయంగా తొలగించడం మానుకోవాలన్నారు. గత ఏడు నెలలుగా వేతనాలు లేక విఒఎలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. విఒఎలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ధర్నా శిబిరం వద్దకు విచ్చేసిన డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ విజయరాజుకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ మాట్లాడుతూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు మేరీ, ఆదిలక్ష్మి, పావని, మరియమ్మ, రమాదేవి, వరలక్ష్మి, జగదాంబ, సుజాత, పార్వతి పాల్గొన్నారు.

చట్టసభల్లో ప్రజగళాన్ని వినిపిస్తా

పిడిఎఫ్ టీచర్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపీమూర్తి

ప్రజాశక్తి - యలమంచిలి

చట్టసభల్లో ప్రజాగళాన్ని విన్పిస్తానని ఉభయగోదావరి జిల్లాల పిడిఎఫ్ టీచర్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపీమూర్తి అన్నారు. టీచర్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ అకాల మరణంతో ఖాళీ అయిన ఎంఎల్‌సి స్థానానికి యుటిఎఫ్ మద్దతుతో పిడిఎఫ్ అభ్యర్థిగా యలమంచిలి మండలం నార్నిమెరక గ్రామానికి చెందిన బొర్రా గోపీమూర్తి అభ్యర్థిత్వం ఖరారైంది. విద్యార్థి దశ నుండి ఉద్యమాల్లో చురుగ్గా ఉన్న గోపీమూర్తి 1998లో ఉపాధ్యాయ వృత్తి చేపట్టి యుటిఎఫ్ మండల శాఖ ప్రధాన కార్యదర్శిగా, జిల్లా కార్యదర్శిగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించి ప్రస్తుతం రాష్ట్ర కోశాధికారిగా ఉన్నారు. ప్రస్తుతం అత్తిలి మండలం కొమ్మర జెడ్‌పి హైస్కూల్లో మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. గుంటూరులో శుక్రవారం జరిగిన యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో బొర్రా గోపీమూర్తిని అభ్యర్థిత్వాన్ని ప్రకటించారు. ఈ నేపథ్యంలో యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యాన ఎన్నికల ప్రచారాన్ని గోపీమూర్తి స్వస్థలం నార్నిమెరక గ్రామ పంచాయతీ గమల్లపెంట నుండి శనివారం లాంఛనంగా ప్రారంభించారు. తొలుత స్థానిక డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, కీర్తిశేషులు షేక్ సాబ్జీ చిత్రపటానికి నివాళులర్పించి లాంఛనంగా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రాజ్యాంగం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని చట్టసభల్లో రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. సామాన్య ప్రజల గొంతుకను చట్టసభల్లో విన్పిస్తానని, పిడిఎఫ్ సభ్యుల వారసత్వాన్ని కొనసాగిస్తానని, నీతి నిజాయతీలతో పని చేస్తానని హామీ ఇచ్చారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం మాట్లాడుతూ ఇంకా నమోదు చేసుకోవాల్సిన ఉపాధ్యాయులు ఈ నెల 15వ తేదీలోగా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి.క్రాంతికుమార్, ఎస్.రత్నరాజు, ఎం.శ్రీనిబాబు, రాష్ట్ర కౌన్సిలర్ ఎంవి.రాజశేఖర్, సిఐటియు నాయకులు దేవ సుధాకర్, యుటిఎఫ్ నాయకులు పంతం రామ్మూర్తి నాయుడు, దాసరి క్షేమమూర్తి, సిహెచ్.శ్రీధర్, బి.నాగబాబు, పి.శ్రీనివాసరావు, జి.అబ్రహం, కె.త్రిమూర్తులు, పివి.రమణరాజు, కుడుపూడి సత్యనారాయణ, రామేశ్వరపు సత్యనారాయణ, చింత సత్యనారాయణ, ఎం.శ్రీధర్, ఎం.బాపిరాజు, జెఆర్‌వి.నాగేశ్వరరావు, వలవల మురళీధర్, వలవల వీర వెంకట సుబ్బారావు, కట్టుపాలెం సర్పంచి పొన్నమండ నాగరాజు, జైభీమ్ ఫౌండేషన్ అధ్యక్షులు జి.సునీల్‌గవాస్కర్, వలవల విష్ణు బాలాజీ, రాఖీ, బొర్రా రవి తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గోపీమూర్తి

ఉచిత ఇసుక విధానం అమలు చేయాలి

సిపిఎం ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - నిడమర్రు

ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించి ఆదుకోవాలని సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణారావు కోరారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ధర్నా చేసి తహశీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానం అమలు చేస్తామని, గత ప్రభుత్వం నిలుపుదల చేసిన భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని ఎన్నికల సమయంలో టిడిపి కూటమి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇసుక అందక కార్మికులకు పనుల్లేక వారు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నారన్నారు. దీంతో నిర్మాణరంగం కుదేలవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే భవన నిర్మాణ కార్మికులు సమస్యాలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఇసుక సత్యాగ్రహం ఆందోళన పోరాటాలుకు పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గౌర సత్యనారాయణ, వెలగలేటి మోహన, టెంకల శ్రీను, సోంబాబు, అలగంజి శ్రీను, కానూరు రాజు, కొప్పురోతి శ్రీను, కంచం వరప్రసాద్ పాల్గొన్నారు.



నిడమర్రులో...

చాట్రాయి : ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు మాట్లాడుతూ ఉచితంగా ప్రజలకు ఇసుక అందించాలన్నారు. ఇసుకను అధిక ధరలకు విక్రయించడం వల్ల సామాన్యులు ఇల్లు నిర్మించుకోలేని పర్లిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో భవనరంగ నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలన్నారు. ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేసి సామాన్యునికి ఇసుక అందుబాటులో తీసుకురావాలని కోరుతూ తహశీల్దార్ డి.ప్రశాంతికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సభ్యులు చాగంటి రాజారావు, గొల్లమూడి రంగారావు, నాగేశ్వరరావు, శ్రీదేవి, సిఐటియు మండల నాయకులు టిఎన్ఎం.సూరి, గజవెల్లి వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు మేడేపల్లి హోలీ మేరీ పాల్గొన్నారు.



చాట్రాయిలో...

మైక్రో ఆర్ట్స్ ఎవరైనా నేర్చుకోవచ్చు

హేలాపురి బాలోత్సవం ఆహ్వాన సంఘం అధ్యక్షులు నాగేశ్వరరావు

ముగిసిన దసరా మైక్రో శిక్షణ శిబిరం

ప్రజాశక్తి - ఏలూరు

బియ్యం గింజలపై అక్షరాలు రాయడం, అగ్గిపుల్లల మీద బొమ్మలు గీయడం వంటి మైక్రో ఆర్ట్స్ పిల్లలు, పెద్దలు ఎవరైనా నేర్చుకోవచ్చని హేలాపురి బాలోత్సవం ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు అన్నారు. మూడు రోజుల దసరా మైక్రో శిక్షణ శిబిరం ముగింపు సభ, శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన వారికి అభినందన, బియ్యం గింజలపై అక్షరాలు రాయడం నేర్పిన దోర శివప్రసాద్, అగ్గిపు ల్లలపై బొమ్మలు చెక్కడం నేర్పిన మేతర సురేష్‌బాబుల సత్కార సభ శనివారం నిర్వహించారు. సభకు హేలాపురి బాలోత్సవం ట్యూషన్ సెంటర్స్ సమన్వయ కర్త కె.జనని స్వాగతం పలికారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అధ్యక్షత వహించారు. సభలో ప్రభుత్వ బాలికల హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీరామ్, టీచర్ సుధాకర్, కరాటే బ్లాక్ బెల్ట్ హోల్డర్ జి.ప్రసాద్, సంధ్యారాణి మాట్లాడారు. మూడు రోజుల శిక్షణ వంద మంది తీసుకున్నారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం మైక్రో ఆర్ట్స్ దసరా శిక్షణ శిబిరం ఏర్పాటుతో పిల్లలు, పెద్దల్లో సృజనాత్మక పెంచేందుకు దోహదపడిందని ఆలపాటి నాగేశ్వరరావు అన్నారు. గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ ప్రతి రోజూ సాయంత్రం నాలుగు గంటలకు ఎఆర్‌డిజికె హై స్కూల్‌లో కర్రసాము శిక్షణ, ఐదు గంటలకు కరాటే శిక్షణ కూడా ఏర్పాటు చేశామని వివరించారు. అనంతరం శివప్రసాద్, సురేష్‌బాబులను కమిటీల తరపున సత్కరించారు. శిక్షణ లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు.


శిబిరంలో పిల్లలు, పెద్దలు, వక్తలు

యుటిఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో రామారావు ప్రతిభ

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు గుంటూరు జిల్లా ఎన్‌టిఆర్ మున్సిపల్ స్టేడియంలో జరిగాయి. ఆ పోటీల్లో 400 మీటర్ల వాకింగ్ పందెంలో ఉంగుటూరు మండలం నారాయణపురం జెడ్‌పి ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు గొల్లపల్లి రామారావు ప్రథమ స్థానం సాధించి విజేతగా నిలిచారు. కృష్ణా, గుంటూరు గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు చేతులమీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకున్నారు. క్రీడల్లో రాణించిన రామారావును నారాయణపురం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.


రామారావును అభినందిస్తున్న ఎంఎల్‌సి లక్ష్మణరావు

ట్రిపుల్ ఐటీలో శ్రీకాకుళం విద్యార్థుల ఆకలి కేకలు

బిల్లులు రాలేదని భోజనం పెట్టని మెస్ నిర్వాహకులు

శ్రీకాకుళం క్యాంపస్ ఇన్‌ఛార్జి జోక్యంతో సమస్య పరిష్కారం

నూజివీడు టౌన్ :నూజివీడు ట్రిపుల్ ఐటి క్యాంపస్‌లోని శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ విద్యార్థులు శనివారం ఆకలితో అలమటించారు. దసరా సెలవులు ఇవ్వడంతో ఎవరికి వారే భోజనాలు చేసి ఇళ్లకు వెళ్లేందుకు అంతా శనివారం మధ్యాహ్నం సన్నద్ధమయ్యారు. వారు భోజనం చేసేందుకు మెస్‌కు చేరుకోగా విద్యార్థులకు ఖాళీ ప్లేట్లు దర్శనమివ్వ డంతో ఖంగుతిన్నారు. ఇదేమిటని మెస్ నిర్వాహకులను విద్యార్థులు ప్రశ్నించగా తమకు బిల్లులు రాలేదని, ఇక భోజనాలు పెట్టే అవకాశం లేదని మెస్ నిర్వాహకులు చెప్పారని వారంతా వాపోయారు. ఈ విషయం తెలియగానే మీడియా అక్కడికి చేరుకోవడంతో స్పందించిన శ్రీకాకుళం క్యాంపస్ ఇన్‌ఛార్జి సురేష్ మెస్ వద్దకు చేరుకుని నిర్వాహకులతో మాట్లాడారు. యుద్ధప్రాతిపదికన విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి అధికారులకు సమాచారం అందించామని, మెస్ నిర్వాహకులతో చర్చించి, రానున్న రెండు రోజులలో బిల్లులు చెల్లించేలా చూస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులకు భోజనాలు పెట్టేందుకు వారు ముందుకొచ్చారన్నారు.

రిపబ్లిక్ డే దినోత్సవానికి అశోక్‌చక్రి ఎంపిక

ప్రజాశక్తి - భీమడోలు

దేశ రాజధానిలో రిపబ్లిక్ డే దినోత్సవం సందర్భంగా జరిగే కార్యక్రమంలో రాష్ట్రం తరఫున హాజరయ్యే ఎన్‌సిసి క్యాడెట్‌గా, భీమడోలు శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో మూడో సంవత్సరం బికాం చదువుతున్న విద్యార్థి జి.అశోక్ చక్రి ఎంపికయ్యారని కళాశాల ఎన్‌సిసి అధికారి కెప్టెన్ ఎన్.శివశంకర్ తెలిపారు. ఈ మేరకు కాకినాడలో నవంబర్ నెలలో నిర్వహించే శిక్షణా శిబిరంలో అశోక్ చక్రి శిక్షణ తీసుకోనున్నారన్నారు. ఇదే క్రమంలో ఎన్‌సిసి క్యాడెట్లుగా బి సర్టిఫికెట్ కోసం నిర్వహించిన అర్హత పరీక్షల్లో భీమడోలు శ్రీ వెంకటేశ్వర కాలేజీ నుంచి పాల్గొన్న 25 మంది బి సర్టిఫికెట్ సాధించడం అభినందనీయమని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్ తెలిపారు. ఈ మేరకు కళాశాలలో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో 19(ఎ) బెటాలియన్‌కి చెందిన హవల్దార్లు మెంబర్ సింగ్, కుల్వంత్ సింగ్ విద్యార్థులకు బి సర్టిఫికెట్ల ప్రదానం చేశారు. బి సర్టిఫికెట్ సాధనలో విద్యార్థులకు అవసరమైన శిక్షణ ఇచ్చిన ఎన్‌సిసి అధికారి కెప్టెన్ ఎన్.శివశంకర్‌ను కళాశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎ.మాధవి పాల్గొన్నారు.


ఎన్‌సిసి క్యాడెట్, ఎన్‌సిసి విద్యార్థులతో యాజమాన్యం

అధికారులు హాజరు కాని గ్రామసభలు ఎందుకు..?

ప్రశ్నించిన మండవల్లి గ్రామస్తులు

ప్రజాశక్తి - మండవల్లి

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా అధికారులను సమాయత్తపర్చలేనప్పుడు గ్రామసభలు నిర్వహించడం ఎందుకని సర్పంచిని గ్రామస్తులు నిలదీసిన సంఘటన మండల కేంద్రమైన మండవల్లిలో శనివారం చోటుచేసుకుంది. స్థానిక నాగేంద్రస్వామి కళ్యాణ మండపంలో సర్పంచి మెండ ఝాన్సీ అధ్యక్షతన మండవల్లి గ్రామసభ నిర్వహించారు. గ్రామ సభకు అధికారులు గ్రామస్తులు కేవలం పదుల సంఖ్యలోనే హాజరు కావడంపై ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు, ఇళ్ల స్థలాల లబ్ధిదారులు సర్పంచిని ప్రశ్నించారు. గ్రామాభివృద్ధికి పట్టుకొమ్మలైన గ్రామసభలను తూతూమంత్రంగా నిర్వహించడం ఎందుకని నిలదీశారు. నాలుగు సంవత్సరాలుగా ఎన్నో సమస్యలతో గ్రామసభకు వచ్చి అర్జీలు ఇస్తూనే ఉన్నామని, సమస్యలు పరిష్కరించరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో సర్పంచి, కార్యదర్శి నిర్లక్ష్యం వల్లే గ్రామసభలకు ప్రజలు హాజరు కావడం లేదని స్పష్టం చేశారు. దీంతో చేసేది లేక సర్పంచి, కార్యదర్శి మౌనం వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రముఖులు గుడివాడ చిట్టిబాబు స్పందించి ఇళ్ల స్థలాల మెరక, పట్టాల పంపిణీపై హౌసింగ్ డిఇని ఫోన్లో వివరం అడిగి తెలుసుకున్నారు సమస్యలను సానుకూలంగా పరిశీలించుకుందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి చొన్నలగడ్డ నాగలక్ష్మి, వార్డు సభ్యులు నాంచారయ్య, సత్యనారాయణ, ముళ్లపూడి, కార్యదర్శి కొండలు, సిహెచ్ఒ శ్రీనివాస్, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు



హీల్ విద్యార్థులకు కప్పు అందిస్తున్న హోం మంత్రి అనిత

హీల్ విద్యార్థుల హ్యాట్రిక్ విజయం

పలువురి అభినందన

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

సిబిఎస్ఇ క్లస్టర్ సెవెన్ కబడ్డీ పోటీల్లో తోటపల్లి హీల్ పాఠశాల బాలికలు హ్యాట్రిక్ విజయం సాధించినట్లు ప్రిన్సిపల్ బి.సాయిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల రెండో తేదీ నుంచి నాలుగో తేదీ వరకు విశాఖపట్నం జిల్లా పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ పాఠశాలలో జరిగిన సిబిఎస్ఇ క్లస్టర్ సెవెన్ కబడ్డీ పోటీల్లో హీల్ స్కూల్ బాలికల జట్టు మూడోసారి ప్రథమ స్థానం సాధించి హ్యాట్రిక్ విజయం సొంతం చేసుకుందని, అండర్-17 విభాగంలో ఈ హ్యాట్రిక్ విజయం సాధించడంతో పాటు, తొమ్మిదో తరగతి విద్యార్థిని జె.కీర్తన బెస్ట్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచిందని తెలిపారు. టోర్నమెంట్ విజేత కప్పును రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత చేతులమీదుగా అందుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి, ఫైనాన్షియల్ డైరెక్టర్ తాతినేని భాస్కర్, సిఈఓ కూరపాటి అజయ్‌కుమార్, ఎడ్యుకేషన్ కమిటీ సభ్యులు మిక్కిలినేని హరీష్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎస్.నాగరాజు, సిహెచ్.దాసు, శ్రీనివాసరెడ్డిలు పాల్గొన్నారు.

8న కౌలు రైతుల రాష్ట్ర సదస్సు

రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు

కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల ఎనిమిదో విజయవాడలో జరుగుతున్న కౌలు రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. ఏలూరులోని జిల్లా పరిషత్ అతిథి గృహం ఆవరణలో రైతు సంఘం, కౌలు రైతుల సంఘం నాయకులు కౌలు రైతుల రాష్ట్ర సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల కారణంగా పంటలు దెబ్బతిని కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి పెట్టుబడి పెట్టిన కౌలు రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 8న ఉదయం పది గంటలకు విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతున్న కౌలు రైతుల రాష్ట్ర సదస్సుకు కౌలు రైతులు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. కౌలు రైతుల పేరుతోనే ఇ క్రాప్ చేసి నష్టపరిహారం ఇవ్వాలన్నారు. వరికి ఎకరాకు రూ.25 వేలు, వాణిజ్య పంటలకు పెట్టిన పెట్టుబడిని బట్టి రూ.60 వేల నుంచి రూ.లక్ష వరకు పంట నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. అన్నదాత సుఖీభవ పథకం పెట్టుబడి సాయం రూ.20 వేలు వెంటనే రైతులు, కౌలు రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులు, సాగుదారుల రుణాలను రీ షెడ్యూల్ చేసి కొత్తగా పంట రుణాలను ఇవ్వాలన్నారు. పంటల బీమా వర్తింప చేసి కౌలు రైతులకే అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కౌలు రైతులు, రైతులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

చింతలపూడి ఎంఎల్ఎ రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రజా సమస్యలు పరిష్కరించడమే తన లక్ష్యమని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండల కేంద్రమైన లింగపాలెం ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ప్రజా సమస్యల వేదిక అనే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ మేరకు మండలంలోని పలు పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను ప్రజలు అర్జీల రూపంలో ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలపై ఆయా శాఖాధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రోషన్‌కుమార్ మాట్లాడుతూ తాను ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు అన్న కీర్తిశేషులు నందమూరి తారక రామారావు అడుగుజాడల్లో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యమన్నారు.



ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగికి గ్రామస్తుల అభినందన

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరుకు చెందిన బండారు గిరిష్ ఎయిర్ ఫోర్స్‌లో 20 సంవత్సరాలుగా వివిధ విభాగాల్లో సేవలందించి సార్జెంట్ హోదాలో ఉద్యోగ విరమణ పొందారు. ఆయన శనివారం స్వగ్రామం ఉంగుటూరు వచ్చారు. ఈ సందర్భంగా అతని చిన్ననాటి మిత్రులు, గ్రామస్తులు ఉంగుటూరు సెంటర్ నుంచి ఊరేగింపుగా ఇంటివరకూ సాగనంపి అభినందించారు.

మద్యం షాపులకు 400 దరఖాస్తులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లా వ్యాప్తంగా శనివారం నాటికి మద్యం షాపులకు 400 దరఖాస్తులు వచ్చినట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత తెలిపారు. ఏలూరు సర్కిల్ పరిధిలో 25 దరఖాస్తులు వచ్చాయని, ఆన్‌లైన్ దరఖాస్తులతో కలిపి ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

కట్నం వేధింపులపై కేసు

ప్రజాశక్తి - ముసునూరు

అదనపు కట్నం కోసం తన భర్త, ఆయన కుటుంబ సభ్యులు వేధిస్తున్నారని ముసునూరు పోలీస్ స్టేషన్‌లో మహిళ ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... లింగపాలెం మండలం తోటికిక గ్రామానికి చెందిన దుర్గా రాజేష్‌కు, ముసునూరు మండలం చింతలవల్లి గ్రామానికి చెందిన అనితకు 2006లో వివాహమైంది. అప్పటి నుంచి తనను తన భర్త, ఆయన కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని అనిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఓవైపు అనారోగ్య పరిస్థితులు మరోవైపు ఏ పని పాటు లేకుండా మద్యానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నగరంలోని మూడో పట్టణ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఏలూరు మూడో పట్టణ ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని ఏడీగిట్టపై జోగి మోహన కోటేశ్వరరావు (45) భార్యతో కలిసి జీవిస్తున్నాడు. మచిలీపట్నం ప్రాంతానికి చెందిన ఆయన గత ఏడేళ్ల క్రితం భార్యతో కలిసి ఏలూరు నగరానికి వచ్చి ఏడీగిట్టపై నివాసం ఉంటున్నాడు. భార్య కూలి పనులు చేస్తూ భర్తను పోషిస్తుండగా భర్త మాత్రం పని చేయకుండా మద్యం సేవిస్తూ భార్యను వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. భార్య టీవీ చూస్తుండగా భార్య లోపలికి వెళ్లి గది తలుపులు వేసుకొని నిద్రకు ఉపక్రమించింది. ఉదయం లేచి చూసేసరికి ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని కనిపించాడు. వెంటనే భార్య పోలీసులకు సమాచారం అందించింది. సమాచారం స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాజాపై ఇజ్రాయెల్ దాడులు ఆపాలి

7న పాలస్తీనా సంఘీభావ దినం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

గాజాపై ఇజ్రాయెల్ దాడులు ఆపాలని, కాల్పుల విరమణ జరిపి చర్చలకు శాంతి పరిష్కారం కోరుతూ ఈ నెల ఏడో తేదీన పాలస్తీనా సంఘీభావ దినం పాటించాలని జిల్లాలో ఉన్న వామపక్ష పార్టీలు ప్రజలకు విజ్ఞప్తి చేశాయి. స్థానిక సిపిఐ కార్యాలయంలో వామపక్ష పార్టీల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ జిల్లా కార్యదర్శి మండల కృష్ణచైతన్య, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు బత్తా వెంకట్రావు, బాషా, న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు తలారి ప్రకాష్, ఎం సిపిఐ జిల్లా నాయకులు ఎస్.నాగరాజు మాట్లాడుతూ గతేడాది అక్టోబర్ ఏడో తేదీ నుంచి ఇజ్రాయెల్ హమాస్ దాడికి ప్రతీకారం దాడి పేరుతో ఇజ్రాయెల్ పాలస్తీనాపై విచక్షణారహితంగా క్రూరమైన దాడులకు పాల్పడుతుందని విమర్శించారు. ఫలితంగా ఇప్పటికే 42 వేల మందికి పైగా పాలస్తీనీయులు మరణించారన్నారు. వీరిలో మహిళలు, చిన్నారులు ఎక్కువగా ఉన్నారన్నారు. వాస్తవానికి ఈ సంఖ్య ఆగస్టు ఆరో తేదీ నాటికి 85 వేలకు పైగా ఉండొచ్చని ప్రముఖ మెడికల్ జర్నల్ లాన్సెట్ అంచనా వేసిందని తెలిపారు. ఇందులో ప్రత్యక్ష, పరోక్ష మరణాలు రెండూ ఉన్నాయన్నారు. ఇజ్రాయెల్ ఈ యుద్ధోన్మాద చర్యలు జాతి నిర్మూలనకు దారితీస్తుందని ఏడాది జనవరిలో అంతర్జాతీయ న్యాయస్థానం వ్యాఖ్యానించిందన్నారు. కాల్పుల విరమణ కోసం జరుగుతున్న అర్థవంతమైన అన్ని చర్చలను ఇజ్రాయెల్ తొక్కేస్తూ మరోవైపు ఏడాది పొడగునా దాడి కొనసాగిస్తుందన్నారు. గాజాలో ఇజ్రాయెల్ సాగిస్తున్న ఈ ఊచకోత, రాక్షసత్వాన్ని నిరసిస్తూ తక్షణమే యుద్ధాన్ని ఆపాలని, కాల్పుల విరమణ అమలు చేయాలని మన రాష్ట్రంలో వది వామపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో పాలస్తీనాకు సంఘీభావంగా ఈ నెల ఏడో తేదీన జిల్లా వ్యాప్తంగా ప్రదర్శనలు, సభలు, సమావేశాలు నిర్వహించాలని వామపక్ష పార్టీలు పిలుపునిస్తున్నాయి. ఏలూరు నగరంలో ఏడో తేదీన ఉదయం పది గంటలకు పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో నగర ప్రజలంతా పాల్గొని ఈ పిలుపును జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాయి. ఈ సమావేశంలో సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్, నాయకులు బి.జగన్నాధరావు, సిపిఐ నాయకులు డాంగే శ్రీనివాస్ పాల్గొన్నారు.

హేలాపురి లయన్స్ సర్వీస్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి


ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కృత్రిమ అవయవాలు అమర్చడం ద్వారా ఎంతోమంది అభాగ్యుల కళ్లల్లో కాంతివెలుగులు నింపుతోన్న హేలాపురి లయన్స్ సర్వీస్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి తెలిపారు. సమాజంలో మార్పు సాధ్యమవ్వాలంటే ఒక్కరి వల్ల సాధ్యం కాదని, పదిమంది ఇటువంటి సేవా కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకుని, చేయూతనందిస్తే అనుకున్న మార్పు సాధ్యపడుతుందన్నారు. కృత్రిమ అవయవాలు అమర్చుకోవడానికి ఆర్థిక స్తోమత లేని వారు తనను సంప్రదిస్తే తన సొంత ఖర్చులతో వాటిని అమర్చేందుకు చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. ఏలూరు న్యూ అశోక్ నగర్‌లోని లయన్స్ కాంప్లెక్స్‌లో ఏలూరు హేలాపురి లయన్స్ క్లబ్ అనుబంధ సంస్థ హేలాపురి లయన్స్ సర్వీస్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కృత్రిమ కాళ్ల తయారీ కేంద్రాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. తొలుత ఆయనకు నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ బడేటి చంటి

అనంతరం పంపిణీకి సిద్ధంగా ఉంచిన కృత్రిమ కాళ్ళను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ విజన్ - 2047 సాధ్యపడాలంటే తొలుత రాజకీయ నాయకుల్లో స్పష్టమైన మార్పు రావాలని, వారు అంకితభావంతో ప్రజలకు సేవ చేస్తే సమాజంలో అద్భుతమైన మార్పు సాధించవచ్చన్నారు. ధనవంతులను అవార్డులతో సత్కరించడం కన్నా సేవా కార్యక్రమాల్లో తమ ప్రత్యేకతను చాటుకుంటున్న వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ అవార్డులను అందిస్తే ఇది ఎంతోమందికి స్ఫూర్తినిచ్చి, మరిన్ని సేవా కార్యక్రమాల అమలుకు దోహదపడుతుందన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎంతోమందికి అవయవాలు అందించేందుకు తయారీ కేంద్రాన్ని ఏలూరులో ఏర్పాటుచేయడం ఎంతో గర్వంగా ఉందని చెప్పారు. ఒక్కొక్క అవయవం తయారీకి రూ.నాలుగు వేలు అవుతుందని నిర్వాహకులు పేర్కొన్నారని, ఎవరికైనా ఆర్థిక ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే తన సొంత ఖర్చులతో అటువంటి వారికి కృత్రిమ అవయవాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పోటీతత్వం, అంకితభావం ఉంటే సమాజంలో ఎంతోమందికి చేయూతనందించేందుకు అవకాశాలు మెండుగా ఉంటాయని ఆయన అభిప్రాయ పడ్డారు. భవిష్యత్తులో ఏలూరు నగరంలో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుని, ఉపాధి అవకాశాలు మెరుగు పరుస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు, వి.మురళీమోహనరావు, పాపారావు నాయుడు, డాక్టర్ డి.సుబ్బారావు, పివి.రమణ, డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య, కెబి.రావు, వడ్లమూడి వెంకటేశ్వరరావు, రావి పద్మకుమారి, బివివి.సత్యనారాయణ, శానం మురళీకృష్ణ, సంకు సురేష్, డి.హేమసుందర్ పాల్గొన్నారు.



నరసింహరాజును అభినందిస్తున్న సర్పంచి గోపీ

కైకరం పంచాయతీ కార్యదర్శిగా నరసింహరాజు

ప్రజాశక్తి - ఉంగుటూరు

కైకరం పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శిగా బైర్రాజు వెంకట నరసింహరాజు బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీలో భాగంగా బాదంపూడి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఆయన కైకరం బదిలీ అయ్యారు. సర్పంచి సలగల గోపీ, వార్డు సభ్యులు, కార్యాలయం ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చారు. గ్రామాభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

మండవల్లికి ఇద్దరు నూతన అధికారులు

ప్రజాశక్తి - మండవల్లి

మండవల్లి మండలానికి నూతన పరిపాలన అధికారిగా కె.రామలింగేశ్వరరావు, విస్తరణ అధికారిగా సిహెచ్.శేఖర్ శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన బదిలీల్లో భాగంగా మోపిదేవిలో పరిపాలనాధికారిగా విధులు నిర్వహిస్తున్న రామలింగేశ్వరరావును, ఆగిరిపల్లిలో విస్తరణ అధికారిగా పనిచేస్తున్న శేఖర్‌ను మండవల్లి విస్తరణ అధికారిగా బదిలీ చేయడంతో మండవల్లి వచ్చారు. ఇప్పటివరకు మండవల్లిలో విస్తరణ అధికారిగా పనిచేస్తున్న ఆనంద్‌బాబు ఆగిరిపల్లి విస్తరణ అధికారిగా బదిలీపై వెళ్లగా శ్రీనివాసరావు గుడివాడ పరిపాలన అధికారిగా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా రామలింగేశ్వరరావు, శేఖర్ మాట్లాడుతూ మండవల్లి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించే విధంగా కృషి చేస్తామన్నారు. పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించడానికి వచ్చిన అధికారులకు కార్యాలయం సిబ్బంది దుశ్శాలువాలతో, పూలమాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కొండలు ప్రభాకర్, రాధిక, సిబ్బంది పాల్గొన్నారు.

దిగుమతి సుంకం శాతం పెండచంపై హర్షం

ప్రజాశక్తి - కామవరపుకోట

కేంద్ర ప్రభుత్వం ఆయిల్ పామ్‌పై దిగుమతి సుంకాన్ని 5.5 శాతం నుంచి 27.5 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకోవడం వల్ల గత నెల ఆగస్టు కంటే ఈ నెల అదనంగా టన్ను పామాయిల్ గెలలకు రూ.2,980 పెరిగి టన్ను రూ.16,930 అవ్వడం పట్ల టిడిపి కామవరపుకోట మండలాధ్యక్షులు కిలారు సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. ఒకేసారి 2980 పెరగడం పామాయిల్ చరిత్రలో ఇదే తొలిసారన్నారు. గత పార్లమెంట్ సమావేశాల్లో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ ఈ సమస్యను లేవనెత్తి పామాయిల్ గెలల రేటు పెరగడానికి దోహదం చేశారని కొనియాడారు.

ఇ-పంట నమోదు వివరాలు తనిఖీ

ఉంగుటూరు :ఇ- పంట నమోదు చేసిన రైతుల వివరాలను జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్‌కె. హబీబ్‌బాషా శనివారం వెల్లమిల్లి, బాదంపూడి, బొమ్మిడి గ్రామాల్లో తనిఖీలు చేశారు. ఇ-పంటలో వివరాల ఆధారం గానే రైతు సంక్షేమ పథకాలు అమలవుతాయని అందుకే మరోసారి సూపర్ చెక్ చేస్తున్నామని జెడిఎ వెల్లడించారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాలు త్వరలో ప్రారంభం కానున్న దృష్ట్యా రైతులతో ఆయన మాట్లాడి సమస్యల గురించి ఆరా తీశారు. మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

బుట్టాయగూడెం : బుట్టాయిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న మ్యాథ్స్ అధ్యాపక గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ సంజీవని కుసుమ తెలిపారు. పోస్ట్ గ్రాడ్యుయే షన్‌లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొందినవారు అర్హులని, అక్టోబర్ 12వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, 14వ తేదీన ఉదయం పది గంటలకు బుట్టాయ గూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు.

శౌరి మాస్టార్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

ప్రజాశక్తి - ముసునూరు

అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రయివేట్ స్కూల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ముసునూరు గ్రామానికి చెందిన భారతీయ విద్యా నికేతన్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండేటి శౌరి మాస్టరుకు రావడం చాలా గర్వకారణంగా ఉందని జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్ అన్నారు. ప్రయివేట్ స్కూల్స్ అసోసియేషన్ డెమోక్రటిక్ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ జగ్గయ్యపేటలో శౌరిమాస్టార్‌ను ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సత్కరించారు.



శౌరిమాస్టార్‌ను సత్కరిస్తున్న వక్తలు

పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు

నూజివీడు టౌన్ :వివిధ విద్యాసంస్థల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు తిరివీధి లక్ష్మీరామారావు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ వ్యవస్థాపక ఛైర్మన్, యువ న్యాయవాది తిరివీధి కృష్ణ నోటు పుస్తకాలను శనివారం వితరణగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టే వివిధ సంక్షేమ పథకాల పాటు సామాజికవేత్తలు చేసే పలు సేవా కార్యక్రమాలతో పేదలకు పూర్తిస్థాయి సేవలు అందుతాయన్నారు. నోటు పుస్తకాలు కొనుగోలు చేయలేని నిరుపేద కుటుంబాలకు చెందిన కొందరు విద్యార్థులు చదువులో వెనుకబడిపోవడం తన దృష్టికి వచ్చిందన్నారు. పేదరికం చదువుకు అడ్డు కాకూడదనే సంకల్పంతో తనవంతు సహాయంగా నోటు పుస్తకాలను అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఎవరి పరిధిలో వారు పేద కుటుంబాలను ఆదుకుంటూ ముందడుగు వేస్తే, ప్రతి ఒక్క విద్యార్థి చదువు ఆటంకం లేకుండా కొనసాగుతుం దన్నారు. నేటి విద్యార్థుల చదువే రేపటి పౌరులుగా వారి భవిష్యత్తును బంగారు బాటల వైపు పయనింపచేస్తుం దన్నారు. సమ సమాజ స్థాపనలో విద్యార్థుల పాత్ర అగ్రభాగాన ఉంటుందని సోదాహరణంగా వివరించారు. అందుకోసం ప్రతిఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు.



పుస్తకాలు అందిస్తున్న దాతలు

19వ డివిజన్‌లో సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణారావు

ప్రజాశక్తి - ఏలూరు

19 డివిజన్ సుందరయ్య కాలనీ, శ్రీనివాస నగర్, గ్రీన్ సిటీ, కొత్తూరు ఇందిరమ్మ కాలనీల్లో రోడ్లను వేయాలని సిపిఎం హనుమాన్ నగర్ 19వ డివిజన్ శాఖ సభ డిమాండ్ చేసింది. స్థానిక సుందరయ్య కాలనీ సిపిఎం కార్యాలయంలో 19వ డివిజన్ హనుమాన్ నగర్ సిపిఎం శాఖ సభ చల్ల పైడియ (బుజ్జి) అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, కూరగాయలు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, వీటిని అరికట్టడం మానేసి, ప్రజా సమస్యల పక్కదారి పట్టించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. శాఖ కార్యదర్శి వి.సాయిబాబు మూడేళ్ల కాలంలో జరిగిన కార్యకలాపాలపై నివేదికను ప్రవేశపెట్టారు. కార్యదర్శిగా ఎ.గంగాధర రావును ఎన్నుకున్నారు. ఈ సభలో శాఖ సభ్యులు పి.సత్తి రాజు, ఆర్.నరసింహమూర్తి, పిల్లి.గురుమూర్తి, ఎ.గంగాధర రావు, కె.చిన్నారావు, కె.నాగమణి, వి.లక్ష్మీకుమారి, ఎం.గౌరి పాల్గొన్నారు.

సిపిఐ గ్రామ శాఖ సమావేశం

ముసునూరు : దేశమంతటా కమ్యూనిస్టు పార్టీ బలపడి స్వార్థ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తే తప్ప పేద, ధనిక వ్యత్యాసాలు తగ్గి సమసమాజ స్థాపన సాధ్యమవుతుందని భారత కమ్యూనిస్టు పార్టీ సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు అన్నారు. ముసునూరులో నిర్వహించిన సిపిఐ గ్రామ శాఖ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కొత్తగా పార్టీలో చేరిన సభ్యులకు కమ్యూనిస్టు పార్టీ నూజివీడు సమితి తరపున స్వాగతం తెలుపుతూ పార్టీ విధివిధానాలను వివరించారు. కోనేరు సురేష్ చంద్ర బెనర్జీ ఏకగ్రీవంగా అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. చెంగల వెంకటేశ్వరరావు సహాయ కార్యదర్శిగా ఉన్నారు. కొల్లి శ్రీనివాసరావు, అయ్యప్ప, మద్దాల జ్యోతి, కుమారి, చెంగల సుబ్బారావు, పవన్‌కుమార్, కొండబోయిన రామకృష్ణ, గొల్లపల్లి మధు, చెంగల పెద్ద రంగమ్మ, శ్రీనివాసరావు సభ్యులుగా ఉన్నారు.

డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - కామవరపుకోట

కామవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తూ సింగపూర్‌లో ఉండే సిపిడిసి మెంబర్ పి.సతీష్‌కుమార్ ఒక్కో విద్యార్థికి రూ.వెయ్యి చొప్పున మొత్తం రూ.ఏడు వేల ప్రోత్సాహక నగదు బహుమతిని కళాశాల అభివృద్ధి కమిటీ సెక్రటరీ, ఆడమిల్లి సర్పంచి జి.కేశవరావు చేతులమీదుగా విద్యార్థులకు అందించారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.విజయబాబు ఆన్‌లైన్ ద్వారా మాట్లాడుతూ కళాశాలలో చేపడుతున్న అభివృద్ధి గురించి వివరించడంతో పాటు విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎం.మల్లేశ్వరరావు, అధ్యాపకులు డాక్టర్ జి.శ్రీనివాసరావు, ఎం.ఉషారాణి, కె.ఇందిరాకుమారి, ధారావతు మల్లేష్, పి.ఏడుకొండలు, విజయకృష్ణ, ఉమ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

సాగు భూములకు పట్టాలివ్వాలని ధర్నా

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలో గుళ్లపూడిలో పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని సిపిఐ (ఎంఎల్) నూజివీడు డివిజన్ కార్యదర్శి వేముల బక్కయ్య కోరారు. అఖిల భారత కిసాన్ మహాసభ మండలాధ్యక్షులు పామర్తి రామారావు అధ్యక్షతన గుళ్లపూడి పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం ధర్నా చేసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వేముల బక్కయ్య మాట్లాడుతూ గుళ్లపూడి గ్రామపంచాయతీ పరిధిలో భూములను ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీస్, ఒబిసి దళిత పేదలు మూడు తరాలుగా సాగు చేసుకుంటున్నారన్నారు. ఆ భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పామర్తి రామారావు, రాజేశ్వరి, బేతపూడి ఏసు, బోట్ల సత్యనారాయణ, నారేపెళ్ల బుజ్జిబాబు, బోట్ల భలేరామయ్య, చిట్టి మాద బసవలింగం, గొల్ల కొండయ్య పాల్గొన్నారు.



ఇ-క్రాప్ బుకింగ్‌ను తనిఖీ చేస్తున్న బాషా

ఇ-క్రాప్ బుకింగ్‌ను త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - చింతలపూడి

వ్యవసాయ పంటల ఇ-క్రాప్ బుకింగ్‌ను త్వరగా పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి, ఏలూరు షేక్ హాబీబ్ బాషా అన్నారు. జిల్లా వ్యవసాయాధికారి షేక్ హాబీబ్ బాషా మండలంలోని ఇ క్రాప్ బుకింగ్‌ను శనివారం తనిఖీ చేశారు. మండలంలోని ప్రగడవరం, దేశవరం, శంఖచక్రపురం, పోనుకుమాడు, తదితర గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల ఇన్‌ఛార్జులు చేసిన వ్యవసాయ పంటల ఇ-క్రాప్ బుకింగ్‌ను తనిఖీ చేశారు.